క్లుప్తంగా

ఉపాధి హామీ పథకం ఏపీఓగా హరికృష్ణ

ఉయ్యాలవాడ: స్థానిక జాతీయ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఏపీఓగా హరికృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఏపీఓ రవిప్రకాష్ ఇటీవల నంది కొట్కూరు మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బనగానపల్లె నుంచి వచ్చిన హరికృష్ణ బదిలీపై ఇక్కడికి వచ్చారు. గ్రామ పంచాయతీల్లో జాబ్‌కార్డులు కలిగిన వ్యవసాయ కూలీలందరికీ ఉపాధి పనులు కల్పించనున్నట్లు ఈ సందర్భంగా నూతన ఏపీఓ అన్నారు.

రుద్రవరం ఏపీఓగా గౌరీబాయ్

రుద్రవరం: ఉపాధి హామీ పథకం ఏపీఓగా గౌరీబాయ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఏపీఓగా విధులు నిర్వహించిన ప్రతాప్ బనగానపల్లెకు బదిలీ అయ్యారు. అలాగే మరి కొంత మంది బదిలీ అయ్యారు. వారి స్థానంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా శిరివెళ్ల నుంచి ఎస్కే హసీనా పర్వీన్, టెక్నికల్ అసిస్టెంట్‌గా శ్రీకాంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అలాగే గణ మద్దిలేటి, నరసింహారెడ్డి అనే మరో ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు గురువారం విధుల్లో చేరతారని ఏపీఓ తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు



ఉయ్యాలవాడ రెవెన్యూ కార్యాలయం ఎదుట చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయ ఆవరణలో బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతుండడంతో రహదారిలో వెళ్లే బాటసారులు, కార్యాలయానికి వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, కార్యాలయ సిబ్బంది, వీఆర్ఓలు పాల్గొన్నారు.

రెండు విడతలుగా వ్యవసాయ విద్యుత్ సరఫరా

నంద్యాల(అర్బన్): స్థానిక క్రాంతినగర్‌లోని ఏపీ ట్రాన్స్‌కో 220 కేవీ సబ్ స్టేషన్‌లో కొత్త బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నామని, జిల్లాలోని రైతులకు అందించే వ్యవసాయ విద్యుత్ సరఫరాను పగలు, రాత్రి రెండు విడతలుగా ఇవ్వనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లోని 100 ఎంవీఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్ బేహెచ్‌వీ సైడ్‌లో ఉన్న పాత 220 కేవీ సర్క్యూట్ బ్రేకర్‌ను తీసి కొత్త బ్రేకర్‌ను అమర్చుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో తలెత్తనున్న అంతరాయానికి ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

క్రీడాకారుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఆసక్తి గల క్రీడాకారులు స్పోర్ట్స్ ఆఫ్ అథారిటీ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించే సిక్స్ వీక్స్ సర్టిఫికెట్ కోర్సుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్స్ మే 6 నుంచి జూలై 2 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా ఈనెల 14లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్: 87126 22576 నంబరును సంప్రదించాలన్నారు.

టీకాలు సకాలంలో వేయించండి



చాగలమర్రిలో ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న నోడల్ అధికారి కాంతారావునాయక్

చాగలమర్రి: పిల్లలకు టీకాలు సకాలంలో వేయించాలని నంద్యాల జిల్లా ఆర్‌బీఎస్‌కే నోడల్ అధికారి కాంతారావునాయక్ అన్నారు. బుధవారం చాగలమర్రి పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక 11వ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న చిన్నారుల స్క్రీనింగ్ పరీక్షలను, 13వ వార్డు, మద్దూరు గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్‌సీడీసీడీ సర్వేను, జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంపై ప్రజలను అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే పథకాలు

మహానంది: ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటేనే సంక్షేమ పథకాలు అందుతాయని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ తెలిపారు. మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని సచివాలయంలో వ్యవసాయ, ఉద్యానశాఖల సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. డీఏఓ మురళీకృష్ణ మాట్లాడుతూ మహానంది మండలంలోని 11 రైతుల సేవా కేంద్రాల పరిధిలో తక్కువ పురోగతి ఉన్న గ్రామాల్లో 100 శాతం పూర్తి చేయాలన్నారు.

వేతన కష్టాలు!

- ఉపాధి కూలీలకు అందని వేతనాలు
- మూడునెలల నుంచి ఎదురుచూస్తున్న వైనం
- ఎంత శ్రమించినా దక్కని గరిష్ట వేతనం
- మండలంలోని కూలీలకు సర్కారు రూ. 55.6 లక్షల బకాయి

గోస్పాడు: గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పథకం పనులే ఆధారం. వాటిని చేస్తేనే పూట గడిచే పరిస్థితి పలు కుటుంబాల్లో ఉంది. దీంతో మండుటెండలను లెక్కచేయకుండా పనులకు వెళ్తున్నారు. అయితే, నెలలు గడుస్తున్నా చేసిన పనులకు వేతనాలు అందడం లేదు. నిబంధనల ప్రకారం చేసిన పనులకు 15 రోజుల్లో వేతనాలు ఇవ్వాలి. ఇది అమలు కాకపోవడంతో పలువురు కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనవరి 15 వ తేదీ నుంచి ఇప్పటి వరకు మండలంలోని కూలీలకు రూ. 55.60 లక్షల దాకా ఇవ్వాల్సి ఉన్నట్లు ఉపాధి హామీ పథకం అధికారులే చెబుతున్నారు.

కొందరికే పనులు

గ్రామాల్లో వలసలను కట్టడి చేయడమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం లక్ష్యం నీరుగారుతోంది. పలు గ్రామాల్లో కూలీలకు సక్రమంగా పనులు కల్పించకపోగా, కొన్ని గ్రామాల్లో కల్పించినా సమయానికి వేతనాలు



గోస్పాడులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ఇవ్వడం లేదు. మండలంలో 9.332 వేల జాబ్ కార్డులు ఉండగా, 19140 మంది కూలీలు ఉన్నారు. అయితే, వారిలో 7,170 మంది మాత్రమే పనులకు హాజరవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. క్షేత్ర స్థాయిలో మాత్రం 250 నుంచి 300 మంది మాత్రమే పనులు కల్పిస్తున్నారు. దీంతో ఉపాధి పనులు లేక పక్కగ్రామాలకు పనికి వెళ్లాల్సి వస్తుందని కూలీలు ఆవేదన చెందుతున్నారు. గ్రామాల్లో పనుల కల్పనలో ఉపాధి అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఎక్కడ ఏం పనులు జరుగుతున్నాయనే విషయం స్థానిక సర్పంచు కానీ, ఎంపీటీసీ సభ్యునికి కానీ తెలియడం లేదని చెబుతున్నారు. కొన్ని గ్రామాల్లో అంతంతమాత్రంగా పనులు జరుగుతున్నాయి. వీటిలో పాల్గొన్న వేతనదారులకు వేతనాలు అందని దుస్థితి. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇదే పరిస్థితి.

అందని గరిష్ట వేతనం...

ఉపాధి సిబ్బంది చెప్పిన కొలతల ప్రకారం పని చేస్తున్నా కూలీలకు మాత్రం ప్రభుత్వం నిర్దేశించిన గరిష్టవేతనం అందడం లేదు. ఎంత కష్టపడినా వేతనం మాత్రం రూ. 250 నుంచి రూ.270కు మించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు పనికి వెళ్తే ఇంతకు రెట్టింపు స్థాయిలో వేతనం వస్తుందని మరి కొందరు కూలీలు చెబుతున్నారు.

ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది



ఉపాధిలో చేసిన పనులకు కూలీల మస్టర్లను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నాం. ఇప్పటి వరకు జరిగిన పనులకు సంబంధించిన నిధులను ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. కూలీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలోనే ప్రభుత్వం పూర్తి స్థాయిలో వేతనాలు చెలిస్తుంది. గరిష్ట వేతనం కోసం స్థానిక సిబ్బంది నిర్దేశించిన కొలతల మేరకు పని చేయాలి.

– అమానుల్లా, ఎంపీడీఓ, గోస్పాడు

ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం



ఈఏడాది ఉపాధి పనులు ప్రారంభం నుంచి చేస్తున్నాం. అయితే, కూలి మాత్రం ఎప్పుడొస్తుందో తెలియటం లేదు. ఇప్పటికే ఎనిమిది వారాల వేతనం రావాల్సి ఉంది. ఈ వేతనంపై ఆధారపడి ఉంటున్న మాకు అవస్థలు తప్పడంలేదు. అధికారులను అడిగితే ఇంకా డబ్బు జమ కాలేదని చెబుతున్నారు. రోజురోజుకూ బకాయిలు పెరుగుతుండటంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాం. వేతనాలు వెంటనే వచ్చేలా చూడాలి.

– చిన్న మౌలాలి, గోస్పాడు, వ్యవసాయ కూలీ

పనులు కల్పించాలి



మాగ్రామంలో పూర్తి స్థాయిలో ఉపాధి పనులు కల్పించటం లేదు. కూలీ పనులపై ఆధారపడిన మాలాంటి వారికి పనులు లేక అవస్థలు పడుతున్నాం. పనులు ఎప్పుడు ఉంటాయో, ఎప్పుడు ఉండవో అర్థంకాని పరిస్థితి ఉంది. ఉపాధి లేక ఇప్పటికే ఎంతో మంది బయటి ప్రాంతాలకు పనులకు వెళ్తున్నారు. అధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా స్థానికంగా పనులు కల్పించాలి.

– వీరమద్దిలేటి, జిల్లెల్ల, వ్యవసాయ కూలీ

రెవెన్యూ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించండి

నంద్యాల: ఫ్రీ హోల్డ్ భూములు, రీ సర్వే, 22ఏ, జాతీయ రహదారుల భూ సేకరణ తదితర రెవెన్యూకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్‌తో కలిసి ఆర్డీఓలు, మండల తహసీల్దార్‌లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ భూములకు సంబంధించి కొత్తగా వస్తున్న అసైన్‌మెంట్‌పై వీఆర్‌ఓలు, సర్వేయర్లు, సంబంధిత సిబ్బందితో జిల్లా, మండల స్థాయిలో వర్క్ షాప్స్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ రెన్యువబుల్ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. అదే విధంగా నేషనల్ హైవే, రైల్వేకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్ఓ రాము నాయక్, ఏఓ రవి కుమార్, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటిండెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేస్తాం



ప్రాజెక్టులు పరిశీలిస్తున్న విదాశాఖాధికారులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టుల్లో ఉత్తమ వాటిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధికి సంబంధించిన సైన్స్‌ప్రాజెక్టులను నిర్వాహకులు గోపాల్ అధ్యక్షతన ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి డీఈఓతో పాటు డిప్యూటీ డీఈఓ శంకరప్రసాద్, సైన్స్ జిల్లా కో ఆర్డినేటర్ కేవీ సుబ్బారెడ్డి, సుందరరావు హాజరయ్యారు. 42 పాఠశాలల విద్యార్థులు ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. వీటిలో తొలి స్థానంలో అవుకు జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థిని దీపిక, కీర్తి రూపొందించిన ప్రాజెక్టు నిలవగా రెండు, మూడు స్థానాల్లో శిరివెళ్ల కేజీబీవీ విద్యార్థిని కరీమున్ సోనియా, ఆళ్లగడ్డ బాలికల ఉన్నతపాఠశాల విద్యార్థిని మేరి శైలజ నిలిచారు. వీరిని విద్యాధికారులు అభినందించి రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అసద్దుల్లా పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ



డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ తులసమ్మ

చాగలమర్రి: మండల కేంద్రమైన మేజర్ గ్రామ పంచాయతీ చాగలమర్రి ఎస్టీ కాలనీలో రూ.15 లక్షల పంచాయతీ నిధులతో డ్రెయినేజీలు, సీసీ రోడ్డు పనులను సర్పంచ్ తులసమ్మ, ఉప సర్పంచ్ షేక్ మహమ్మద్ సోహెల్ బుధవారం భూమి పూజ చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీకి 2025–26 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ, ఇన్‌చార్జ్ ఈఓ తాహెర్ హుసేన్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ షబ్బీర్, చాగలమర్రి-4వ ఎంపీటీసీ సభ్యురాలు అనుషరెడ్డి, 11వ వార్డు సభ్యురాలు సుశీల, వార్డు సభ్యుడు మాబుసున్న, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్బారాయుడు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల ఎలక్షన్ కమిటీ సభ్యుల ఎన్నిక



నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ ఎన్నికల నియమావళి కమిటీ సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): బార్ అసోసియేషన్ సభ్యుల పదవి కాలం ముగియడంతో బుధవారం న్యాయవాదుల ఎన్నికల నియమావళి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు రావినూతల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ గత సంవత్సరంలో వారు పని చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, జమ ఖర్చులు గురించి న్యాయవాదులకు వివరించారు. అనంతరం ఎన్నికల కమిటీ సభ్యులకు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చిన పత్రాన్ని ఎన్నికల కమిటీ సభ్యులకు అందజేశారు. బార్ అసోసియేషన్‌లో దాదాపుగా 430 మంది న్యాయవాదులు నమోదు అయినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం రామకృష్ణయ్య, తాళంకి వెంకటప్రసాద్, శ్రీనివాసులు, రఘు ప్రకాష్, చిన్న సుదాంసురెడ్డి, షేక్ షన్ను, తిరుపాలును ఎన్నికల నియమావళి కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. త్వరలో ఎన్నికల తేదీని ప్రకటిస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై నిరసన



ఆందోళన కార్యక్రమం చేపట్టిన ఎస్‌డీపీఐ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం పట్టణంలోని గాంధీ చౌక్‌లో ఎస్‌డీపీఐ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కాలం మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లుతో ముస్లింల హక్కులకు భంగం వాటిల్లుతుందని, ఈ బిల్లును తక్షణమే బీజేపీ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే తాము నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. టీడీపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకించాలన్నారు. డబ్ల్యూఐఎం ఉమెన్స్ ఇండియా మూవ్‌మెంట్ నాయకురాలు పూలజారీన మాట్లాడుతూ టీడీపీ ఎంపీలు బిల్లును వ్యతిరేకించకపోతే రాష్ట్రవ్యాప్తంగా మరో షాహిన్ బాగ్ ఉద్యమాన్ని మొదలు పెడతామని హెచ్చరించారు. నిరసనలో ఎస్‌డీపీఐ, ఉమెన్స్ ఇండియా మూవ్‌మెంట్ నాయకులు, కార్యకర్తలు ముస్లిం సంఘాల ప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలి

- జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా



పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ

ఆత్మకూరు: నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలిపై కఠినంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. సైబర్ నేరాలు, రహదారి ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సిబ్బందికి సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి ఆవశ్యకతను ప్రజలకు వివరించి, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా చైతన్యం చేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రామాంజి నాయక్, సీఐలు రాము, సురేష్‌కుమార్ రెడ్డి ఉన్నారు.

రసవత్తరంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు





హోరాహోరీగా సాగుతున్న ఎడ్ల పోటీలు, విజేతగా నిలిచిన ఎద్ల యజమానులకు మెమొంటో అందజేస్తున్న రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తదితరులు

గోస్పాడు: శ్రీగుమ్మిత మల్లికార్జునస్వామి, శ్రీవీరభద్రస్వామి జాతరను పురస్కరించుకుని పామిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డిల జ్ఞాపకార్థం బుధవారం గోస్పాడులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలు రసవత్తరంగా సాగాయి. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీనాగిరెడ్డి ఈ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. బండలాగే ఎద్దులను, ఒంగోలు జాతి పశు పోషకులను ప్రోత్సహించేందుకు ఏటా గ్రామంలో రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో ఆరు జతల ఎద్దులు పాల్గొనగా నంద్యాల జిల్లా శిరివెళ్ల మండలం గుంపరమానుదిన్నె గ్రామానికి చెందిన కందూరు రాంభూపాల్‌రెడ్డి ఎద్దులు 1,854 అడుగులు లాగి మొదటి స్థానం సాధించి రూ.60వేలు బహుమతి పొందాయి. నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్.కొత్తూరుకు గ్రామానికి చెందిన బీరాబుల్స్ ఎద్దులు 1,789 అడుగులు లాగి రెండో స్థానంలో నిలిచి రూ.40 వేలు సొంతం చేసుకున్నాయి. వైఎస్సార్ జిల్లా వైఎంఆర్ కాలనీకి చెందిన గురివిరెడ్డి, అనంతపురం జిల్లా గన్నివారిపల్లె కాలనీకి చెందిన ఎద్దులు 1,647 అడుగులు లాగి మూడో స్థానం సాధించి రూ. 30 వేలు గెలుపొందాయి. బాపట్ల జిల్లా కుల్లికురువ గ్రామానికి చెందిన పీవీఎస్ఆర్ బుల్స్ పావులూరి వీరస్వామి ఎద్దులు 1,503 అడుగులు లాగి నాలుగో స్థానంలో నిలిచి రూ.20 వేలు సొంతం చేసుకున్నాయి. అలాగే, నంద్యాల జిల్లా ఇసుకపల్లె గ్రామానికి చెందిన సిద్దయ్య ఎద్దులు, అనంతపురం జిల్లా గన్నివారి పల్లెకు చెందిన రమేష్‌బాబు ఎద్దులు వరుసగా ఐదు, ఆరు స్థానాలు సాధించడంతో కి రూ. 5వేల చొప్పున నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్ననాగిరెడ్డి, ఉప మండల అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రిటైర్డు వీఆర్‌ఓ ఉమామహేశ్వరరావు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

దొర్నిపాడు: మండలంలో నేటి నుంచి మొబైల్ ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3, 4 తేదీల్లో క్రిష్టిపాడు, దొర్నిపాడు, 5న బుర్రారెడ్డిపల్లె, డబ్ల్యూ కొత్తపల్లె గ్రామాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 0–6 వయస్సు గల చిన్నారులకు నూతన ఆధార్‌కార్డులు తీస్తున్నట్లు చెప్పారు. ఇంకా ఆధార్‌లో సవరణలు ఉంటే తగిన ధ్రువపత్రాలు సమర్పించి అప్డేట్ చేసుకోవాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు సౌజన్య, నాగేశ్వరరావు ఆధార్ క్యాంపు నిర్వహిస్తారన్నారు. ఆయా గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సెలవుల్లో ఉయ్యాలవాడ ఎంపీడీఓ

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఉమామహేశ్వరరావు సెలువుల్లో వెళ్లారు. అనారోగ్య రీత్యా ఆరు వారాలు (42 రోజులు) సెలవుపై వెళ్లారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వరరావుకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కొనసాగించనున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

11 నుంచి దరఖాస్తుల స్వీకరణ

దొర్నిపాడు: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చేందుకు కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ సావిత్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11నుంచి మే 20 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. మెడికల్ షాపులు, ల్యాబ్, ఎలక్ట్రిక్ బ్యాటరీ చార్జింగ్ యూనిట్లు, ఎలక్ట్రిక్ ఆటో, కార్లు, గూడ్స్ ట్రక్ యూనిట్లు ద్వారా ప్రభుత్వం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. రేషన్‌కార్డు, ఆధార్, కుల, ఆధాయ, బ్యాంక్ పాస్‌పుస్తకాలను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు.

ముస్లింల హక్కులను హరిస్తున్న ప్రధాని

నంద్యాల(అర్బన్): ముస్లింలకు రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను హరించడానికే ప్రధాని నరేంద్రమోదీ వక్ఫ్ సవరణ బిల్లు తెచ్చారని కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ విమర్శించారు. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వాలని టీడీపీ విప్ జారీ చేయడం సరైంది కాదని, బిల్లును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీల ప్రయోజనాలను దెబ్బతీసే బిల్లుకు టీడీపీ, జనసేనలు మద్దతు ఇవ్వడం దారుణమన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు బూత్ స్థాయి నుంచి నాయకుల నియామకాలను చేపడుతున్నామన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



డిపో ఆవరణలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఎన్‌ఎంయూఏ నాయకులు

నంద్యాల (వ్యవసాయం): తమ సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఆర్టీసీ ఉద్యోగులు నంద్యాల డిపో ఆవరణలో ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిపో కార్యదర్శి సుబ్బరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సస్పెన్షన్లు, తొలగింపు లేకుండా 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, వెంటనే పదోన్నతులు చేపట్టాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వం లేదా ఇతర సంస్థల ద్వారా కొనాలని, నైట్ సర్వీస్ అలవెన్సులు రూ.150 నుంచి రూ.400కు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమం గురువారం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నరసింహ, శ్రీనివాస్ రెడ్డి, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

గోస్పాడు: నంద్యాల–కోవెలకుంట్ల రహదారిలో మండలంలోని ఒంటి వెలగల గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మార్కాపురం పట్టణానికి చెందిన గురునాథం కారులో ఉమాపతి నగర్‌కు వెళ్తుండగా వాహనానికి కుక్క అడ్డు వచ్చింది. దానిని తప్పించబోగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువలో బోల్తా పడింది. ఈ ఘటనలో గురునాథం అక్కడికక్కడే మృతిచెందగా కారులో ఉన్న మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

ప్రజాధనాన్ని వృథా చేయకండి

- రాజకీయాలకు అతీతంగా నంద్యాల అభివృద్ధి జరగాలి
- మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశంలో ఛైర్‌పర్సన్ మాబున్నిసా
- సీఎం పర్యటనకు రూ. 1.42 కోట్లు మంజూరు చేయాలని టీడీపీ కౌన్సిలర్ల పట్టు
- మెజార్టీ కౌన్సిలర్ల అభిప్రాయం మేరకు రూ.90 లక్షలు మంజూరు చేసిన ఛైర్ పర్సన్





సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్, సమావేశాన్ని బాయ్ కాట్‌చేస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ నిధులు వృథా చేయకుండా అభివృద్ధి పనులకు వాడుకుందామని, ఇందుకు కౌన్సిల్ సభ్యులు సహకరించాలని ఛైర్‌పర్సన్ మాబున్నిసా కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల మూడో శనివారం స్వచ్ఛంద్ర కార్యక్రమంలో భాగంగా నంద్యాలకు రానున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మున్సిపల్ ఛైర్ పర్సన్ అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించి వివిధ అంశాలపై చర్చించారు. సీఎం పర్యటనకు మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.1,42,40,000 నిధులు కేటాయించాలని టీడీపీ కౌన్సిలర్లు పట్టుబట్టగా ఛైర్‌పర్సన్ మెజార్టీ కౌన్సిలర్ల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని రూ. 90 లక్షలు మంజూరు చేశారు. ఇందుకు టీడీపీ కౌన్సిలర్లు సమావేశాన్ని బాయ్‌కాట్ చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు క్రిష్ణమోహన్ మాట్లాడుతూ సీఎం పర్యటనను స్వాగతిస్తున్నామని, అయితే జనరల్ ఫండ్ నుంచి భారీగా నిధులు కేటాయించాలనడం సరికాదన్నారు. అవసరమైతే స్పెషల్ గ్రాంట్ తీసుకువచ్చి సీఎం పర్యటనకు ఖర్చు చేయాలని అన్నారు. పర్యటన ఖర్చు భారం ప్రజలపై పడరాదని తెలిపారు. ఆరు నెలల క్రితమే నంద్యాల పట్టణంలో బ్యూటీఫికేషన్ చేపట్టారని, మళ్లీ ఇప్పుడు సీఎం పర్యటన నేపథ్యంలో ఆయా పనులకు భారీగా నిధులు కేటాయించాలనడం సరికాదన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాబున్నిసా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నంద్యాల పర్యటనకు రావటాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. సీయం చంద్రబాబును కౌన్సిల్ సభ్యులు ఎవ్వరూ కించపరచ లేదని అవసరమైన మేరకే నిధులు ఖర్చు చేయాలని సూచించారని, అనవసర ఖర్చులు చేయవద్దని మాత్రమే కోరారన్నారు. మెజార్టీ సభ్యుల సూచనల మేరకు సీఎం పర్యటనకు రూ. 90లక్షలు మంజూరు చేశామన్నారు. అంతకు ముందు నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులలో నెలకొన్న సమస్యలను కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషవలి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.